క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

రామకుప్పం: కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 1 గంట వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి శుక్లం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ లెన్సు అమర్చుతారని పేర్కొన్నారు. కంటి ఆపరేషనుకు వచ్చే వారు ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబరు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

ఎరువుల దుకాణాల తనిఖీ


గోదామును పరిశీలిస్తున్న అధికారులు

సదుం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు(తిరుపతి) అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఐ వెంకటరవి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. రికార్డులను పరిశీలించి స్టాకును సరిచూశారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు అందించాలని ఆదేశించారు. స్టాకు వివరాలు, ధరల పట్టిక బోర్డును ప్రదర్శించాలన్నారు. నాణ్యత లేని ఎరువులు విక్రయించరాదని హెచ్చరించారు. వారి వెంట ఏఓ హరిప్రసాద్ ఉన్నారు.

బలిజల బలోపేతానికి కృషి

పుంగనూరు: బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికి అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన ఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి రాఘవరాయల్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు పట్టణంలో బలిజ సంఘం అధ్యక్షుడు నానబాలమణి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక బలిజ సంఘం నాయకులు నానబాల కుమార్, ఆనందరాయల్ , యుగంధర్, పూల భాస్కర్, రాయల్ అంజప్ప పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఆరిఫా షేక్ తెలిపారు. సివిల్, క్రిమినల్, ఇన్సూరెన్స్, తదితర కేసులకు సంబంధించిన కేసులు, రాజీకి అనువైన కేసులను ఈ లోక్ అదాలత్ నందు పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మకు అభిషేకాలు



చౌడేపల్లె: బోయ కొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. రాహుకాల సమయం10:30 గంటల నుంచి 12 గంటల వరకు సంప్రదాయంగా అర్చనలు , అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబు చేసి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాదం సౌకర్యం కల్పించారు.

శ్రీవిరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు

పుంగనూరు: పట్టణంలోని బస్టాండులో వెలసిన శ్రీవిరూపాక్షి మారెమ్మకు శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి నెయ్యిదీపాలు పెట్టి, చల్లముద్ద నైవేద్యంతో మొక్కులు చెల్లించుకున్నారు.

22న కృత్రిమ అవయవ పరికరాల శిబిరం

పలమనేరు: ఈనెల 22న పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద కృత్రిమ అవయవ పరికరాల పంపిణీ కోసం అవసరమైన వారిని గుర్తించేందుకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వాకర్లు, చేతికర్రలు, వీల్‌చైర్‌లు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, వాయిస్‌ఫోన్లు, ఎంఎంఐడీ కిట్స్ తదితరాలను అవసరమైన వారిని గుర్తించి ఆపై అందజేస్తామని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్, రేషన్‌కార్డు, సదరం ధ్రువప్రతం, ఫొటోలు, ఫోన్ నంబరుతో పాటు రెండు జతల జిరాక్సులు వెంట తీసుకురావాలని సూచించారు.

నేడు నీటి సంఘాల ఎన్నిక

పుంగనూరు: పుంగనూరు పరిధిలోని నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు నీటిపారుదలశాఖ ఏఈ ప్రవీణ్ తెలిపారు. పుంగనూరు పరిధిలో 13 చెరువులు ఉన్నాయన్నారు. చెరువు ఆయకట్టుదారులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

చౌడేపల్లె: మండలంలోని తొమ్మిది సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి తెలిపారు. పుదిపట్ల-3, పెద్దకొండామర్రి-1, కాటిపేరి-1, చౌడేపల్లె-1, చారాల-1, మేకలచిన్నేపల్లె-1, దాదేపల్లె-1 మొత్తం తొమ్మిది చెరువుల పరిధిలోని రైతులకు ఆయా గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆరునెలలూ వంచనే బాబు


మహిళలకు డబ్బులిస్తారనే ప్రచారంతో ఇటీవల పోస్టాఫీసుల వద్ద ఖాతాల కోసం పడిగాపులు

ఎన్నికలప్పుడు సూపర్‌సిక్స్ పేరిట హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరునెలలైనా వాటిని అమలు చేయలేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు మోసపోయామంటూ ఆందోళన చెందుతున్నారు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి జనం దృష్టిని మరల్చేందుకు ఏదో ఒక అంశాన్ని తెర పైకి తెస్తూ కూటమి ప్రభుత్వం ఆరుమాసాలుగా కాలయాపన చేసింది. –పలమనేరు

- అమలు కానీ సూపర్‌సిక్స్ హామీలు
- మోసపోయామనే భావనలో జనం
- మహిళలకు తప్పని మనోవేదన
- జనాన్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వం

పలమనేరు నియోజకవర్గంలో 1.30 లక్షల మంది మహిళా ఓటర్లున్నారు. వీరిలో 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వారికి ఏటా రూ.18 వేలు ఇస్తామన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరిట ఏడాదికి రూ.15 వేలు ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తామని మాటిచ్చారు. ఇక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అంటూ ఆశలు కల్పించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమంటూ మొక్కుబడిగా 20 శాతం మందికి ఓ సిలిండర్ దక్కేలా తెలివిని ప్రదర్శించారు.

అన్నదాతలకు అగచాట్లు

నియోజకవర్గంలో 40 వేల రైతు కుటుంబాలున్నాయి. కూటమి ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం ఇస్తామని ఇవ్వలేదు. పైగా గతంలో వీరికి వస్తున్న రైతు భరోసా కూడా రాష్ట్ర ప్రభుత్వ వాటా రావడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి ఇప్పుడు పండిన వరి పంటకు గిట్టుబాటు ధర లేక ధాన్యాన్ని రైతులు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో కరువు మండలాలను ప్రకటించారే గాని రైతులు దీంతో ఇప్పటి వరకు ఎలాంటి ప్రయోజనం పొందలేదు.

కొండెక్కిన నిరుద్యోగభృతి

రాష్ట్రంలో కోటి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని లేదంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికలప్పుడు మాటిచ్చారు. దీంతో వేల మంది నిరుద్యోగులు స్థానికంగా ఎదురుచూస్తున్నారు. ఇక వలంటీర్లకు నెలకు పది వేల వేతనమంటూ ఆ వ్యవస్థకే మంగళం పలికారు. ఏదేమైనా సూపర్‌సిక్స్ పేరిట కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఎవరికి ప్రయోజనం దక్కిందంటే..

కూటమి పేరు చెప్పుకొని నియోజవర్గంలోని అన్ని మండలాల్లో ఇసుకాసురులు వందల మంది నిత్యం వేల లోడ్ల ఇసుకను అమ్ముకుంటున్నారు. మద్యం సిండికేట్ ద్వారా కూటమి నేతలకు మేలు చేకూరింది. ఎటూ చూసిన బెల్టుషాపుల ద్వారా ఆ పార్టీ కార్యకర్తలకు ఆదాయాన్ని కల్పించారు. నాయకులకు సీసీ రోడ్డు పనులు కేటాయించారు. ఉపాధి ద్వారా కూటమి కార్యకర్తలకు మేలు కలిగేలా యంత్రాలతో పనులు చేసుకున్నా బిల్లులు దక్కేలా చూసుకున్నారు. ఇక చెరువుల్లో యధేచ్ఛగా మట్టిని తోలుకునే అనధికారిక హక్కును కల్పించారు. మొత్తం మీద కూటమి సర్కారు ఆరు నెలల పాలనలో వీరికి మాత్రం లాభం చేకూర్చి అన్ని వర్గాలను మాయదారి హామీలతో ముంచేసి చెవిలో పూలు పెట్టారనే మాట నియోజకవర్గంలో గట్టిగా వినిపిస్తోంది.


చెరువులో సాగిస్తున్న మట్టి దందా (ఫైల్)

పురపాలికలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పుంగనూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నుంచి ప్రజలకు సహాయ సహకారం అందించేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ కార్మికులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తక్షణం కార్యాలయానికి సమాచారం అందించేందుకు ఫోన్ 08581-252166ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజశేఖరబాబు

పులిచెర్ల(కల్లూరు): కిశోర బాలికలు తమ బంగారు భవిష్యత్తుకు సరైన పునాది వేసుకోవాలని ఎంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కిశోర బాలిక వికాసంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు ఈ వయస్సులో మంచి బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసం మంచి పునాది వేస్తుందన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు సమష్టిగా నిలిచి బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.జానకీరావు, ఎంఈఓలు సిద్దరామయ్య, తాతయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేసిన ప్రభుత్వం


తరలివెళుతున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

పలమనేరు: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే , నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వెంకటేగౌడ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పలమనేరు నుంచి భారీగా తరళివెళ్లారు. ఈ సందర్భంగా వెంకటేగౌడ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలకు మోసాలు తప్ప మేలు జరగలేదన్నారు. ముఖ్యంగా రైతులకు తీరని నష్టాలు కూటమి ప్రభుత్వంలో తలెత్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీల పేరిట జనాన్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఘోర ఓటమి తప్పదన్నారు. కార్యక్రమానికి నియోజకర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరళివెళ్లారు.

అధిక ఫీజులపై డీఈఓకు ఫిర్యాదు

రొంపిచెర్ల: రొంపిచెర్లలోని ఆకాష్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రతి రోజు ఫోన్లు చేసి తల్లిదండ్రులను ఫీజు డబ్బులు ఇవ్వకపోతే బుక్స్ ఇవ్వమని, హాల్ టికెట్లు ఇవ్వమని ఉపాధ్యాయులు బెదిరిస్తున్నారని తల్లిదండ్రులు వాపోయారు. 75 శాతం ఫీజు చెల్లిస్తేనే పుస్తకాలు ఇస్తామని లేకపోతే ఎవరికీ ఇవ్వమని చెప్పారని తెలిపారు. ప్రైవేటు పాఠశాల తీరుపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మాకు ఫిర్యాదు అందలేదన్నారు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ బాబు

రామకుప్పం: మండల పరిధిలోని రైతులు రెవెన్యూ సదస్సు ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బాబు పేర్కొన్నారు. రామకుప్పం సచివాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ.. ఇకపై ఎవరూ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. రైతులు వినతిపత్రాల ద్వారా తెలిపిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కోర్టుల్లో ఉన్న భూసమస్యలకు కోర్టు ద్వారానే పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, స్థానిక నేతలు, రైతులు పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి వేడుకలు

కుప్పం: దత్త జయంతి సందర్భంగా శనివారం శ్రీ షిర్డీ సాయి మందిరాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని హెచ్‌పీ రోడ్డు, మోడల్ కాలనీలో నెలకొన్న సాయి బాబా మందిరాల్లో శ్రీ దత్త జయంతి వేడుకల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం పంచామృత అభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతం , మధ్యాహ్నం అన్నదానం, సాయంకాలం ప్రాకారోత్సవం, కార్తీక దీపం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా ఆరిఫాషేక్


న్యాయమూర్తి ఆరిఫాషేక్

పుంగనూరు: పట్టణంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జిగా ఆరిఫాషేక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న న్యాయమూర్తి పదోన్నతిపై పుంగనూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి న్యాయమూర్తిగా ఉన్న శిరీష్ వద్ద నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన న్యాయమూర్తి ఆరిఫాషేక్ , మదనపల్లె న్యాయమూర్తి శిరీష్ కలసి న్యాయవాదుల సంఘం కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం అయ్యారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులతో పాటు న్యాయవాదులు నూతన జడ్జితో సమావేశమై కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

గండి పూడ్చివేత

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారి పల్లె పంచాయతీలోని చిట్టారెడ్డి చెరువు తూముకు గండి పడింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో చెరువుల్లోకి నీరు చేరింది. మతుకువారిపల్లె సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి దీనిని గుర్తించి స్థానిక రైతులు, జేసీబీ సాయంతో తూముకు పడిన గండిని పూడ్చి వేయడంతో నీరు వృథాపోకుండా అరికట్టారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్‌లో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సుబ్బరాజు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి పడకుండా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు అందుబాటులో ఉన్న పరికరాలను ఎలా వినియోగించాలో విద్యార్థులతో స్వయంగా మాక్ డ్రిల్ చేయించారు. ఎక్కడైన అగ్ని ప్రమాదాలు జరిగితే అలసత్వం చేయకుండా సమీపంలో ఉన్న అగ్నిమాపకశాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయభాస్కర్‌రెడ్డి, నరసింహులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అడ్డుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు, బైరెడ్డిపల్లె : ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ అరుణశ్రీ

రొంపిచెర్ల: గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని వాటిని అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష పేర్కొన్నారు. శుక్రవారం రొంపిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. బాల్యవివాహాలతో తల్లీబిడ్డ ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. ఎక్కడైన బాల్యవివాహాలు జరిగితే సమాచారం ఇస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఏఓ రెడ్డెప్ప ఆచారి, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామకుప్పం: తల్లిదండ్రులు బాల్యవివాహాలను ప్రోత్సహించకూడదని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పిల్లల ఉజ్వల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందన్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కల్పన, ఎంఈఓ నారాయణ, ఏఎస్ఐ రెడ్డిశేఖర్, సూపర్‌వైజర్లు సుగుణ, పద్మావతి, వెంకటేశ్వరీ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: గ్రామ స్థాయిలో బాల్యవివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీడీపీఓ అరుణశ్రీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల, బాలికలకు 18 సంవత్సరాల వరకు విద్య, వైద్యం, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపించే విధంగా అవగాహన కల్పించాలని ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, ఈఓపీఆర్డీ ప్రసాద్, వైద్యాధికారి అరుణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

గొర్రెల మంద.. లాభాల పంథా


గొర్రెల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లు


ఫామ్ హౌస్‌లో పెంచుకుంటున్న గొర్రెలతో ఇక్బాల్

- ఆదాయం 3 లక్షలు.. వ్యయం లక్ష
- గొర్రెల పెంపకంతో ఆదాయం
- ఎంత బరువున్నా గొర్రె రూ.6 వేలే!
- కొనేందుకు ఎగబడుతున్న జనం

కుప్పం రూరల్: వ్యవసాయంపై మక్కువతో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన రైతు ఇక్బాల్ వృత్తి రీత్యా ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియాల్లో పని చేసిన అనుభవం ఉంది. వయస్సు పైబడడంతో కొంత మంది స్నేహితుల సలహాలతో కుప్పం మండలం, గుడ్లనాయనపల్లి వద్ద 10 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అక్కడే లక్షల రూపాయలు ఖర్చు చేసి వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా గొర్రెల పెంపకం చేస్తూ నెలకు సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుండగా అందులో ఖర్చు లక్ష పోనూ నికరంగా రూ.2 లక్షల ఆదాయం ఆర్జిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల ఔషధ మొక్కలతో పాటు కోళ్లు, గొర్రెలను పెంచుతున్నాడు. ప్రత్యేకంగా గొర్రెలకు రెండు రకాల షెడ్లు వేశారు. కోయంబత్తూరు నుంచి గొర్రె పిల్లలను తెచ్చుకుని ఇక్కడ పెంచి విక్రయాలు చేస్తున్నారు. జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతంలో గొర్రెలను పెంచుతుండడంతో గొర్రెలు ఎలాంటి రోగాల బారీన పడకుండా పెరుగుతున్నాయి. ఆరు నెలలకోమారు గొర్రె పిల్లలు ఉత్పత్తి వస్తుండడంతో ఓ పక్క విక్రయాలు చేస్తుంటే మరో పక్కగొర్రె పిల్లలు, పొట్టేళ్ల సంతతి పెరుగుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా మేకలు

ఫామ్ హౌస్‌లో గొర్రెలతో పాటు పొట్టిగా ఉన్న రెండు మేకలు జనాన్ని ఆకర్షిస్తున్నాయి. ఇక్బాల్‌కు వ్యవసాయంపై మక్కువ చూసి అమెరికాలోని అతని స్నేహితులు రెండు మేకలను బహుమతిగా ఇచ్చారు. ఈ మేకలు చాలా తక్కువ ఎత్తులో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఈ మేకలు సైతం సంతానోత్పత్తి చేస్తుండడంతో ఆదాయం ఎక్కువ మొత్తంలో వస్తోంది.

ఏది కొన్నా రూ.6 వేలే...

వ్యవసాయ క్షేత్రంలో పెరుగుతున్న గొర్రె, పొట్టేలు ఏదైనా బరువుతో సంబంధం లేకుండా రూ. 6 వేలకే విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో గొర్రెలు, పొట్టేళ్ల బరువును బట్టి విక్రయాలు చేపడుతుంటారు. కానీ ఇక్బాల్ మాత్రం చిన్నా, పెద్దా, బరువుతో తేడా లేకుండా ఏది కొన్నా రూ.6 వేలే తీసుకుంటున్నాడు. బయట మార్కెట్‌లో రూ.12 వేలు పలికే గొర్రెలను సైతం ఇక్కడ రూ.6 వేలకే పంపిణీ చేస్తున్నారు. దీంతో నెలలో సరాసరిన 30 నుంచి 40 వరకు గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు చేస్తున్నారు. ఆదివారం అయితే జనం వ్యవసాయ క్షేత్రానికి ఎగబడుతున్నారు. దీంతో మేత, కూలీ ఇతర ఖర్చులు అన్ని పోను ఇక్బాల్‌కు నెలకు రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది.


ప్రత్యేక ఆకర్షణగా పొట్టి మేకలు

స్థానికుల కోసమే...

నా వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న గొర్రెలు, పొట్టేళ్లు చెన్నై, బెంగళూరుకు ఎగుమతి చేస్తే మంచి లాభాలు వస్తాయి. కానీ నేను గుడ్లనాయనపల్లి గ్రామానికి 15 ఏళ్ల కిందట వచ్చాను. అప్పుడు నన్ను అందరూ ఆదరించారు. దీంతో నా వ్యవసాయ క్షేత్రంలో వచ్చే దిగుబడి స్థానికులకు విక్రయించగా మిగిలినవి ఎగుమతి చేస్తున్నా. ఇందులో భాగంగానే గొర్రెలను తూకాలతో సంబంధం లేకుండా ఏది కావాలన్నా 6 వేల రూపాయలకే ఇస్తున్నా. ఇంత తక్కువకు విక్రయించినా నాకు లాభాలే వస్తున్నాయి.

–ఇక్బాల్, రైతు, గుడ్లనాయనపల్లి

అల్లు అర్జున్‌పై రాజకీయ కుట్ర

పలమనేరు: పుష్ప సినిమాహాల్లో ఓ మహిళ మృతికి సినీ హీరో అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, గతంలో గోదావరి పుష్కరాల్లో అప్పటి సీఎం చంద్రబాబు కారణంగా 29 మంది భక్తుల మృతికి ఆయనపై ఎందుకు కేసు నమోదు చేయలేదని, పలమనేరు వైఎస్సార్‌సీపీ నాయకుడు గణేష్‌యాదవ్ విమర్శించారు. తన నివాసంలో శుక్రవారం సోషల్ మీడియా వేదికగా మాట్లాడారు. కేవలం గత ఎన్నికల నుంచి అల్లు అర్జున్‌పై కత్తి గట్టిన చంద్రబాబు కావాలనే రాజకీయ కోణంలో ఇలాంటి చర్యలకు దిగినట్లు సామాన్య ప్రజలకు సైతం ఈ విషయంలో అర్థమైందన్నారు. అల్లు అర్జున్ రాజకీయంగా జగన్‌మోహన్‌రెడ్డికి సాయం చేస్తారోనని భయపడి కూటమి ప్రభుత్వం తెలంగాణ సర్కార్‌తో కుమ్మక్కై ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.

కుదిరిగాని గుట్టపై కార్తీకదీపం


కార్తీకదీపాన్ని వెలిగిస్తున్న విశ్వబ్రాహ్మణులు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని కుదిరిగానిగుట్టపై శుక్రవారం సాయంత్రం విశ్వబ్రాహ్మణులతో కార్తీకదీపం వెలిగించారు. ఏటా ఆనవాయితీగా తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై అరుణాచలేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక దీపం వెలిగించిన తరువాత కుదిరిగానిగుట్టపై వెలిగిస్తున్నారు. అనంతరం స్థానికులు మొక్కుబడులు తీర్చుకున్నారు. శివనామస్మరణతో కుదిరిగానిగుట్ట ప్రాంగణం మార్మోగింది.


నిండిన మతుకువారిపల్లె చెరువు

చెరువులకు జలకళ

పులిచెర్ల(కల్లూరు): రెండు రోజులుగా కురిసిన వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. గత వర్షాలతో అరకొర నీటితో ఉన్న చెరువులు ఈ వర్షంతో నిండి పోయాయి. చెరువుల్లోకి నీరు రావడంతో పాటు మెట్ట ప్రాంతాల్లోని బోర్లన్నింటిలో నీరు వృద్ధి చెందింది. దీంతో పంటల సాగుకు రైతులకు ఇబ్బంది లేకుండా పోయింది.